సాక్షి

# మెట్రో@ 11.45 PM



ఫెస్ట్‌లో భాగంగా పెయింటింగ్స్ ప్రదర్శన

## ఏప్రిల్ 1 నుంచి రైళ్ల వేళల్లో మార్పులు

- ఉదయం 6 నుంచి రాత్రి 11.45 గంటల వరకు సర్వీసులు
- ఘనంగా ముగిసిన హైదరాబాద్ మెట్రో ఆర్ట్, మెట్రో ఫెస్ట్

సాక్షి, సిటీబ్యూరో: నగరంలో ఇక రాత్రి 11.45 గంటల వరకు మెట్రో సేవలు అందుబాటులో రానున్నాయి. అన్ని టెర్మినల్ స్టేషన్‌ల నుంచి మొదటి సర్వీసు ఉదయం 6 గంటలకు, చివరి సర్వీసు రాత్రి 11.45 గంటలకు బయలుదేరనున్నాయి. సోమవారం నుంచి శుక్రవారం వరకు ఈ వేళలు కొనసాగుతాయి. శనివారం యథావిధిగా ఉదయం 6 గంటలకు మొదటి సర్వీసు బయలుదేరుతుంది. చివరి సర్వీసు మాత్రం రాత్రి 11.45 గంటలకు బదులు రాత్రి 11 గంటలకే బయలుదేరుతుంది. ఆదివారం మాత్రం మొదటి సర్వీసు ఉదయం 7 గంటలకు, చివరి సర్వీసు రాత్రి 11 గంటలకు బయలుదేరుతాయి. ఏప్రిల్ 1 నుంచి మెట్రో కొత్త వేళలు అందుబాటులోకి వస్తాయి. హెచ్ఎంఆర్ఎల్, హైదరాబాద్ మెట్రో ఎల్అండ్‌టీ సంస్థలు సంయుక్తంగా ఏర్పాటు చేసిన మెట్రో ఆర్ట్ అండ్ ఫెస్ట్ ఉగాది వేడుకలు ఎర్రమంజిల్‌లోని ఎల్అండ్‌టీ ప్రీమియా మాల్‌లో శనివారం ఘనంగా ముగిశాయి. ఈ సందర్భంగా అధికారులు పలు కీలక విషయాలను వెల్లడించారు. డిజిటల్ ఇంటిగ్రేషన్‌లో భాగంగా టి–సవారీ మొబైల్ యాప్ సేవలను మరింత ఆధునికీకరించనున్నట్లు తెలిపారు. అలాగే.. స్టూడెంట్ స్పెషల్ పాస్‌ను మరో ఏడాది పాటు పొడిగించినట్లు పేర్కొన్నారు.

**సూపర్ సేవర్ ఆఫర్ బంద్..**

సెలవులు, పండగలు తదితర ప్రత్యేక సందర్భాల్లో ప్రయాణికులు కేవలం రూ.59 చెల్లించి నగరంలో మెట్రోల్లో పర్యటించేందుకు ప్రవేశపెట్టిన సూపర్‌సేవర్ హాలిడే ఆఫర్ గడువు ఈ నెల 31తో ముగియనుంది. పాక్షిక రద్దీ వేళల్లో అందుబాటులో ఉన్న తగ్గింపు ఆఫర్ కూడా ముగియనుంది.

**ప్రయాణం.. సృజనాత్మకం...**

హైదరాబాద్ మెట్రో ప్రయాణాన్ని ఒక సాధారణమైన ప్రజా రవాణా సదుపాయంగా మాత్రమే కాకుండా ప్రయాణికులకు కళాత్మకమైన, సృజనాత్మకమైన అనుభూతిని అందజేసేందుకు మెట్రో ఆర్ట్‌అండ్ ఫెస్ట్ వేడుకలను నిర్వహించినట్లు హైదరాబాద్ మెట్రో రైల్ ఎండీ ఎన్వీఎస్ రెడ్డి తెలిపారు. ఎల్అండ్‌టీ మెట్రోరైల్ ఎండీ, సీఈఓ కేవీబీ రెడ్డి మాట్లాడుతూ.. టీ–సవారీ యాప్‌ను మరింత మెరుగుపర్చి ప్రయాణికులకు అందుబాటులోకి తెచ్చామన్నారు. హైదరాబాద్ మెట్రో డిజిటల్ సేవలను మరింత సమర్థవంతంగా అమలు చేసినట్లు చెప్పారు. డిజిటల్ సేవల పూర్తి వివరాల కోసం ఎల్అండ్‌టీ మెట్రో వెబ్‌సైట్‌ను సందర్శించవచ్చన్నారు. అనంతరం కళాకారులు వేసిన పెయింటింగ్స్ ఆకట్టుకున్నాయి.

### ఏప్రిల్ 1 నుంచి మెట్రో వేళలు ఇలా..

- సోమవారం నుంచి శుక్రవారం వరకు: నాగోల్, రాయదుర్గం, ఎల్బీనగర్, మియాపూర్, ఎంజీబీఎస్, జేబీస్ టెర్మినల్ స్టేషన్లలో మొదటి సర్వీసు ఉదయం 6 గంటలకు, చివరి సర్వీసు రాత్రి 11.45 గంటలకు బయలుదేరుతాయి.
- శనివారాల్లో మాత్రం మొదటి సర్వీసు యథాతథంగా ఉదయం 6 గంటలకు బయలుదేరుతుంది. చివరి సర్వీసు మాత్రం రాత్రి 11 గంటలకు బయలుదేరుతుంది.
- ఆదివారాల్లో అన్ని టెర్మినల్ స్టేషన్‌ల నుంచి ఉదయం 7 గంటలకు మొదటి సర్వీసు బయలుదేరుతుంది. చివరి సర్వీసు రాత్రి 11 గంటలకు బయలుదేరుతుంది.